# అమ్మా! నువ్వు మారావు



- ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి

# విషయసూచిక


1. వెన్నెల్లో తాజ్‌మహల్
2. అమ్మా ! నువ్వు మారావు
3. కారణం
4. పండగ
5. అభిమాని
6. ఎదురు తిరిగిన చిట్కా
7. అబ్బులక్ష్మి - అప్పారావు
8. తిక్క కుదిరింది
9. రోడ్డుమీద ఇళ్లు
10. ఈ తరం తండ్రి
11. వెనకడుగు
12. హమ్మయ్య
13. వి.ఆర్.ఎస్.
14. బావా-మరదళ్ళు

# వెన్నెల్లో తాజ్‌మహల్



"వెంకన్నా అన్నీ సర్దేశావా" అంటూ వచ్చాడు రంగారావు బిజినెస్ మాగ్నెట్.

“అయ్యా, సర్దేశామయ్యా” అన్నాడు వినయంగా వెంకన్న.

“సరే. అయితే నువ్వు ఇంటికెళ్ళి తొందరగా భోజనం చేసేసి రా. అమ్మగారేరి ?” అడిగాడు.

“అమ్మా, బాబులిద్దరూ బజారుకెళ్ళారయ్యా. ఏదో కొనాలట, ఇప్పుడే వచ్చేస్తామని ఎల్లారయ్యా” అన్నాడు.

“వీళ్ళు పెళ్ళి అవుతున్నా షాపింగ్ చేసేలాగే ఉన్నారు. సర్లే నువ్వెళ్ళిరా” అన్నాడు.

“సరేనయ్యా” అన్నాడు వెంకన్న. కానీ కదల లేదు.

“కదలవేం” అన్నాడు చిరాగ్గా.

“తొందరగా బయలుదేరితే కానీ పెళ్ళి టైముకి చేరలేము”

“అయ్యా, సిన్న ఇన్నపమయ్యా” అన్నాడు చేతులు నలుపుకుంటూ

“ఏమిటీ” అన్నాడు రంగారావు చూడాల్సిన ఫైళ్ళు, పట్టుకెళ్ళాల్సిన ఫైళ్ళు పరిశీలిస్తూ.

“అయ్యా మా బుడ్డోడు కూడా వస్తానని సంపుతున్నాడయా. ఎంత, సెప్పినా ఇనటం లేదయ్యా. ఆడికి తాజ్‌మాల్ సూడాలని సాలా కోరికయ్యా సిన్నప్పటి నుండి” అన్నాడు మాటలు నసుగుతూ, మింగేస్తూ భయంగా వెంకన్న.

“ఏమిటీ ? నిన్నే కాక, వాడిని కూడా తీసికెళ్ళాలా ? కారులో చోటుండొద్దూ, అది కారా లేక లారీ అనుకున్నావా ?” అన్నాడు కోపంగా.

‘‘అయ్యా ఆడికి ఇడిగా సోటు వద్దయ్యా. నా వళ్ళో కూసోబెట్టుకుంటానయ్యా. నిన్నటి నుండి రావద్దన్నానని తిండి తినటం లేదయ్యా. నేను ఆగ్రా పోతున్నానని ఇప్పటి నుంచి గోల సేస్తున్నాడయ్యా’’ అన్నాడు, భయపడుతున్నాడు, కడుపు తీపితో, ఆశ చావక అన్నాడు వెంకన్న.

ఒక్క క్షణం ఆలోచించాడు రంగారావు. పోనీ రానీ, తన భార్యకు ఎప్పుడూ తలనొప్పి, కాళ్ళు నొప్పులు. తన శరీరం తనే మోసుకోలేదు. పైగా పిల్లలు, సామాను, ప్రాణమిత్రురాలి కూతురి పెళ్ళని తప్పక వెళ్ళాలని శ్యామల గొడవ చెయ్యటంతో తప్పనిసరిగా కంపెనీ పని కూడా వేసుకొని బయలుదేరాడు. కానీ తనకి వాళ్ళ గురించి శ్రద్ధ పట్టటం కుదరదు.

నిజానికి వెంకన్న కొడుకు నారిగాడు పదేళ్ళవాడే అయినా బలంగా ఉండి, తండ్రి కంటే బాగా పనిచేస్తాడు. కారులో విడిగా చోటు వద్దంటున్నాడు. భోజనం వసతి ఖర్చులు పెళ్ళివారింట్లో అయిపోతాయి. ఊరికే ఇద్దరు పనివాళ్ళు వస్తుంటే కాదనటం ఎందుకు ? ఇవన్నీ క్షణంలో ఆలోచించాడు బిజినెస్‌మాన్ రంగారావు.

‘సరేకానీ, తొందరగా వచ్చెయ్యండి’ అన్నాడు దయార్ద్ర హృదయంతో వప్పుకుంటున్నట్లు రంగారావు.

‘‘సిటికెలో వచ్చేస్తామయ్యా’’ కాళ్ళకి దణ్ణం పెట్టి, ఆనందంతో ఉప్పొంగిపోతూ, ఇంటికి బయలుదేరాడు వెంకన్న.

ఎట్టి నాగమ్మ నిన్నటి నుండి ఏమీ తినటం లేదు. నిన్నొ

ఆగ్రా తీసికెళ్తానన్నారు అయ్యగారు అని సెపితే ఆడెంత ఆనందపడిపోతాడో తనకి తెలిసిందే. తాజమహల్ చూడాలని ఆడికెంత కోరికో తనకి తెల్వదా ?

“పెళ్ళికెడుతూ పిల్లిని చంకనెత్తుకెళ్ళినట్లు వాడెందుకండీ ?” అంది శ్యామల చిరాగ్గా.

“ఎందుకో అక్కడికెళ్ళాక నీకే తెలుస్తుందిలే. నీకెంతమంది పనివాళ్ళున్నా చాలరుగా” అన్నాడు నవ్వుతూ రంగారావు.

శ్యామల మూతి విరిచింది.

నారిగాడు సంతోషంతో ఉప్పొంగిపోతున్నాడు. ఎట్టకేలకి తన కోరిక తీరబోతోంది, తాజ్‌మహల్ చూడబోతున్నాడు. తన కలల పంట అది.

పాఠ్యపుస్తకంలో చదివినప్పటి నుంచి. తాజ్‌మహల్ బొమ్మ చూసినప్పటి నుంచి, వాడిని ఎందుకో అది విపరీతంగా ఆకర్షించింది. ఒక్కసారి జీవితంలో చూస్తే ఎంత బాగుంటుంది అనిపించేది. కానీ చదువంటే ప్రభుత్వం పుణ్యమాని ఊరికే వస్తోంది కానీ, అంత ఖర్చు పెట్టి ఆగ్రా తీసికెళ్ళి ఎవరు చూపిస్తారు ?

కానీ ఎవరు ఆగ్రా వెళ్ళామన్నా తాజ్‌మహల్ గురించి అడిగిందే అడిగి, చెప్పిందే చెప్పించుకుని తనివితీరా వినేవాడు. ముఖ్యంగా తాజ్‌మహల్ వెన్నెల్లో చూడాలని వాడి కోరిక. అది ఇంత కాలానికి అయ్యగారి పుణ్యమాని తీరబోతోంది. కానీ వాడి సంతోషం, గొప్ప చెప్పుకోవటానికి, స్నేహితులతో పంచుకోవటానికి టైము దొరకలేదు. చెల్లెళ్ళని మాత్రం ఊరించి, తనకున్న ఒకే ఒక్క మంచి నిక్కర్,

చొక్కా చేతి సంచిలో సర్దుకుని, జుట్టుకు నూనె రాసి నున్నగా తల్లితో దువ్వించుకొని తండ్రితో బయలుదేరాడు ఉత్సాహంగా.

తల్లి పెద్దింటివాళ్ళతో ఎలా ఉండాలో ఎన్నో జాగ్రత్తలు చెప్పింది. అన్నిటికీ బుద్ధిగా తలూపాడు. రెండు ముద్దలు బలవంతంగా తిన్నాడు.

ఆగ్రా చేరుకున్నారు. ఆరోజే పెళ్ళి. మధ్యాహ్నం పెళ్ళి భోజనాలు అయ్యేంతవరకూ వెంకన్నకి, నారిగాడికి ఊపిరాడని పనులు

ఉత్తప్పుడే ఎన్నో పనులు పురమాయించే శ్యామల, వాళ్ళకింత ఫేవర్ చేశామనే ఉద్దేశ్యంతో ఎంత వాడుకోవచ్చో ఇద్దరినీ, పనులకి అంతా వాడుకుంది. పిల్లల పనికొకరిని, తన పనికొకరిని కేటాయించింది. పెళ్ళి భోజనాలు అయ్యేటప్పటికి వళ్ళు హూనమయ్యింది ఇద్దరికీ.

"సరే. ఇద్దరూ వెళ్ళి తాజ్‌మహల్ చూసి, తొందరగా వచ్చెయ్యండి. మళ్ళీ రాత్రే బయలుదేరాలి. అయ్యగారు లేటయితే కోప్పడతారు" అంటూ బస్సుకు, తాజ్‌మహల్ చూడటానికి అయ్యే ఖర్చుకు బొటాబొటిగా చేతిలో పెట్టబోయింది. వాళ్ళిదివరకే చూడటంతోటి, పెళ్ళి హడావుడిలో అలసిపోయిన తల్లీ పిల్లలు రెస్టుకి ఉపక్రమించబోతున్నారు. రంగారావు పనిమీద బయటకెళ్ళాడు.

"ఉరే నారిగా. ఊరేగింపు టైముకి పూలజడ ఇస్తాడో ఇవ్వడో నువ్వెళ్ళి దగ్గరుండి అల్లించు కొచ్చెయ్యి" అంటూ వచ్చింది పిల్ల తల్లి.

శ్యామల పెళ్ళివారికి కూడా వీళ్ళని పని వాళ్ళని చేసేసింది గొప్ప కోసం. తను పనులు చెప్పగా మిగిలిన టైములో వాళ్ళ పనులు చేయించింది.

“వాళ్ళు తాజ్‌మహల్ చూడటానికి వెళ్తున్నారులే లీలా. ఇంకెవరినైనా పంపుదాంలే” అంది శ్యామల ఆవలిస్తూ.

“తాజ్‌మహలా” అంది ఆశ్చర్యంగా లీల.

“అవును. మా నారిగాడికి వెన్నెల్లో తాజ్‌మహల్ చూడాలని చాలా కోరికట. పాపం పనివాళ్ళ కోరికలు మనం కాపోతే ఎవరు తీరుస్తారు. అసలందుకే తీసికొచ్చాం కారులో” అంది గొప్పగా శ్యామల.

“భలేదానివే. శ్యామలా. వెన్నెల్లో తాజ్‌మహల్ ఏమిటి ? ఇవాళ అమావాస్య కదా మరిచిపోయావా ?” అంది.

నాలిక్కరుచుకుంది శ్యామల. నిజానికి ఆమెకి తిథులు అవీ తెలినూ తెలీవు. పట్టించుకోను పట్టించుకోదు.

“పోనీలే ఊరికే చూసి వస్తారులే” అంది.

“మామూలుగా కూడా ఈ రోజు చూడలేరు. ఎందుకంటే ఈ రోజు శుక్రవారం బంద్ ఉంటుంది. ఎవ్వరినీ లోపలికి పంపరు. తాజ్‌మహల్ బయట నుంచి కనబడదు. నేచెప్పిన పని చేసుకురానీ” అంటూ మళ్ళీ హడావిడిగా లోపలికి వెళ్ళిపోయింది లీల.

శ్యామల చేతిలో డబ్బులు లోపల వేసుకుంది బేగ్‌లో “ఇంకా నయం ఇచ్చేశాక తెలియలేదు. మళ్ళీ తీసుకుంటే బాగుండేది కాదు” అనుకుంటూ.

“సరే మీ అదృష్టం అంత అధ్వాన్నంగా ఉంటే నేనేం చేసేది ? అదృష్టం అంటిద్దామంటే అంటుకోవద్దూ. సరే వెళ్ళి లీల చెప్పిన పని చేసుకు రండి. నేను కాసేపు పడుకుంటాను. మళ్ళీరాత్రంతా కారులో ఇరుక్కోవాలి” అంది ఆవలిస్తూ పిల్లల ప్రక్కన చోటు చేసుకుంటూ.

నిజానికి వెనుక సీట్లో ఆమె పిల్లలు మాత్రమే కూర్చుంటే, ముందు సీట్లో తనూ, తన వళ్ళో నారిగాడు, సారు, డ్రైవర్ ఇరుక్కున్నారు.

ఆమె తలచుకుంటే రేపయినా వెళ్ళొచ్చు. కానీ తలచుకోదు. తలచుకోమని అడిగే ధైర్యం తమకి ఉండదుగా ! ఉదారంగా తనకీ, పెళ్ళి పనులకీ ఇద్దరు పనివాళ్ళు దొరికినట్లయ్యింది. అదే బయటివారికి చేస్తే ఎన్ని డబ్బులొచ్చేవో. ఇంటిదగ్గరుంటే రెస్టయినా దొరికేది, కానీ ఇవేమీ అనలేరుగా.

అందుకే పాలుగారే నారిగాడి చెంపలపై జాలువారబోతున్న కన్నీళ్ళు ఎవరికంటా పడకుండా తన గుండెల్లో దాచుకుని ఓదార్చటానికి, లీల చెప్పిన పూలజడ తెచ్చే నెపంతో, నారిగాడి చెయ్యి పట్టుకుని నిశ్శబ్దంగా బయటికి వచ్చేశాడు వెంకన్న.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2101**

* * *